RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 75 | ఫిబ్రవరి 7, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ..
నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379

# చదువరుల చైతన్యం ఎటువైపో?

- కీలకంగా టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు
- విద్యాధికుల మద్దతు ఎవరికి లభించేనో?
- రాష్ట్ర సర్కారుకు అనుకూలమా? వ్యతిరేకమా?

**వేద న్యూస్, ఫోకస్ టీమ్ :**

రాజ్యాంగ నిర్మాతలు గొప్ప ఆలోచనతో విద్యాధికులైన టీచర్స్, గ్రాడ్యుయేట్స్‌ను మాత్రమే ఓటర్లుగా నిర్ణయించి శాసనమండలిలో వారి తరఫున ప్రజాప్రతినిధులుగా పలువురిని ఎన్నుకునే అవకాశం కల్పించారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే మేధావులు, బుద్ధిజీవులుగా ఉన్న వీరి మద్దతు ఎవరి వైపు ఉంటుందనేది కీలకం. కాగా, ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఎమ్మెల్సీ ఎలక్షన్స్ సైతం సాధారణ ఎన్నికల మాదిరిగానే మారిపోయాయని చెప్పొచ్చు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు పార్టీలు డబ్బు, మందు పంపకాలు చేస్తూ.. ఈ ఎన్నికలను సైతం కాస్ట్‌లీ రొటీన్ ఎలక్షన్స్‌గా మారుస్తున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలను, డబ్బు ఖర్చుకు వెనకాడని వారిని గెలుపు గుర్రాలుగా భావించి వారిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా రంగంలోకి దింపుతున్నారు. దాంతో సామాజిక సేవకు బదులుగా రాజకీయమే ఇక్కడా ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో చదువరుల చైతన్యం ఏ మేరకు వెల్లివిరుస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఎవరిని తమ ప్రజాప్రతినిధిగా ఎన్నుకుంటారనేది ఇంపార్టెంట్ అంశమైంది. బుద్ధిజీవుల మద్దతు రాష్ట్ర సర్కారుకు ఏ మేరకు ఉంటుందనేది కూడా కీలకమే. ఈ నెల 27న కరీంనగర్-మెదక్ -ఆదిలాబాద్-నిజామాబాద్ టీచర్స్, గ్రాడ్యుయేట్స్, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. మార్చి 3న రాబోయే ఫలితాల్లో గ్రాడ్యుయేట్స్, టీచర్స్ తీర్పు ఎలా ఉంటుందనేది వెరీ ఇంట్రెస్టింగ్‌గా మారింది. కాంగ్రెస్‌కు అనుకూలంగా వస్తే.. తమ 14 నెలల పాలనకు ప్రజలు అండగా ఉన్నారని రాష్ట్రంలో అధికారంలో ఉన్న హస్తం పార్టీ ప్రభుత్వమే పేర్కొంటుంది. ప్రతిపక్షంగా ఉన్న బీజేపీకి మద్దతు లభిస్తే.. రాష్ట్రంలోనూ కమలం హవా కొనసాగుతుందని కమలనాథులు ధీమా వ్యక్తం చేయొచ్చు. ఇక ఈ ఎన్నికల్లో ప్రస్తుతానికి అయితే



బీఆర్ఎస్ పోటీలో నిలిచి అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. దాంతో బరిలో నిలిచేందుకు గులాబీ పార్టీ వెనకడుగు వేస్తున్నదా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. చూడాలి మరి.. విద్యాధికుల తీర్పు ఎలా ఉంటుందో..





# ఎస్ఐ కావలెను..!

- దోమకొండ పోలీస్ స్టేషన్‌కు..
- నెల రోజులుగా ఖాళీగా ఎస్‌హెచ్‌వో పోస్టు
- మండల పరిధిలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరిగే ప్రమాదం
- వెంటనే సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌ను నియమించాలని మండల ప్రజల రిక్వెస్టు

**వేద న్యూస్, డెస్క్:**

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల పోలీస్ స్టేషన్‌కు స్టేషన్ హౌజ్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో) లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఎస్ఐ(సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్)గా పనిచేసిన ఆంజనేయులు బదిలీపై ఇటీవల భిక్కనూర్‌కు వెళ్లారు. అప్పటి నుంచి దోమకొండ పీఎస్‌కు ఎస్ఐ లేరు. నెలరోజులు గడుస్తున్నా ఇంకా ఇప్పటి వరకు ఎస్ఐని నియమించకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని జనం చెప్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేద్దామని వెళితే దోమకొండ ఎస్ఐగా ఇంకా ఎవరిని నియమించలేదని పోలీసులు చెప్తున్నారని వెల్లడిస్తున్నారు.

**సమస్యలన్నీ పెండింగ్‌లోనే..**

ఎస్‌హెచ్‌వోగా రెగ్యులర్ సబ్ ఇన్‌స్పెక్టర్ లేకపోతే మండల పరిధిలో శాంతి భద్రతల పర్యవేక్షణ ఎలా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల సమస్యలు పెండింగ్ లోనే ఉంటున్నాయని వెల్లడిస్తున్నారు. దోమకొండ ఎస్ఐగా కొత్త వారికి బాధ్యతలు అప్పగించాలని పోలీస్ డిపార్ట్‌మెంట్ వారిని మండలవాసులు కోరుతున్నారు. ఎస్ఐ మరికొన్ని రోజులు లేకుండా ఉంటే.. మండల పరిధిలోని గ్రామాల్లో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. ఇతరులకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం కంటే కూడా దోమకొండ మండల పీఎస్‌కు రెగ్యులర్ ఎస్ఐని వీలైనంత త్వరగా నియమించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తూర్పులో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు కృషి చేస్తాం

- వరంగల్ జిల్లా టియూడబ్ల్యూజే టెంజు కార్యవర్గ సమావేశం
- సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్క సభ్యుడికి యూనియన్ నుండి హెల్త్ ఇన్సూరెన్స్
- టియుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్. లెనిన్



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

టీయుడబ్ల్యూజే 143 లో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్క సభ్యుడికి యూనియన్ నుండి హెల్త్ ఇన్సూరెన్స్ చేసి వారికి అండగా ఉండేందుకు కృషి చేస్తామని టీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్.లెనిన్ అన్నారు.

గురువారం వరంగల్ తూర్పు జర్నలిస్టు పరపతి సంఘం భవనంలో టీయూడబ్ల్యూజే, టెంజు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మిట్ట నవనీత్ గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా టీయు డబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు బిఆర్ లెనిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గం పలు తీర్మానాలను ఆమోదించింది. అనంతరం బిఆర్ లెనిన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డెస్క్ జర్నలిస్టులను గుర్తించి అల్లం నారాయణ అక్రిడిటేషన్లు ఇప్పిస్తే ప్రస్తుత ప్రభుత్వం కోత పెట్టేందుకు సిద్ధమైందని, ఒక వేళ అదే జరిగితే పోరాటాలకు సిద్ధమని తెలిపారు. గత 10 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులను అల్లం నారాయణ నేతృత్వంలోని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కడుపులో పెట్టుకుని కాపాడుకుందని అన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందించి జర్నలిస్టులకు మనోధైర్యాన్ని నింపిన ఘనత తమ యూనియన్‌కు దక్కుతుందని అన్నారు. ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తుమ్మ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెరుమాడ్ల వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరిపై పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన పిటిషన్‌ను ప్రెస్ క్లబ్ కమిటీ వెనిక్కి తీసుకుని, వారి సభ్య త్వాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు యూనియన్లు, అసోసియేషన్లు, ఫెడరేషన్ల పాత్ర కీలకంగా ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకిడి శ్రీనివాస్, కోశాధికారి రాపల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మిట్ట నవనీత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నీలం శివ, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తౌటి కామేష్ , కంది భరత్, కమటం వేణుగోపాల్, బండి రవి, టెంజు ఉపాధ్యక్షుడు పిండం విజయ్, ఎండీ అమీర్,విద్యాసాగర్, వేణు, జాయింట్ సెక్రెటరీ కిరణ్, ప్రభాకర్, అనిల్ ,రమేష్, సనత్, ప్రదీప్, చందు, సంతోష్, కృష్ణ, యుగేందర్, నరేందర్, రాజు, రాజేష్ పాల్గొన్నారు.

# డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**



తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్(టీఎస్ జేయు) ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేపట్టబోతున్న 2కే రన్ కార్యక్రమ ప్రచార పోస్టర్‌ను గురువారం ఏసిపిలు బి.నందిరాం నాయక్, బి.తిరుపతి, వరంగల్ ఎమ్మార్వో ఇక్బాల్, సిఐలు ఓ.రమేష్, బి.రాజాగోపాల్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులకి అభినందనలు తెలియజేశారు. ఇట్టి 2కే రన్ లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ జేయు స్టేట్ జనరల్ సెక్రటరీ తోకల అనిల్ కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాని కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి, ఉపాధ్యక్షులు లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, బత్తుల సత్యం,నాగపురి నాగరాజు, ఈద శ్రీనాథ్, కార్యవర్గ సభ్యులు నాగపూరి అవినాష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# వార్త రాస్తే బెదిరిస్తారా?

- జర్నలిస్టును బెదిరింపులకు గురి చేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి
- టీఎస్ జెయు డిమాండ్

4లో..

# కంట్లో నలుసుగా మారిన తీన్మార్ మల్లన్న



హైదరాబాద్ : కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ స్వపక్షంలో విపక్షంలా మారాడు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అప?పటి సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేయడం, నాటి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా వెలుగులోరి వచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయారు. తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం పలుమార్లు తీన్మార్ మల్లన్నను అరెస్టు చేయించింది. దీంతో ఆయన బీజేపీలో చేరారు. తర్వాత బయటకు వచ్చి 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీనియర్లను కాదని తీన్మార్ మల్లన్నకు టికెట్ ఇచ్చి గెలిపించింది. కానీ, ఇప్పుడు సొంత పార్టీపైనే విమర్శలు చేస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. రెండు రోజుల క్రితం వరంగల్‌లో నిర్వహించిన బీసీల సభకు హాజరై రెడ్డి సమాజికవర్గంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇక తాజాగా కుల గణన నివేదికను తప్పు పట్టారు. లైవ్‌లోనే కులగణన పత్రాలను తగులబెట్టారు. అంతే కాకుండా బీసి కులగణన సర్వే రిపోర్ట్ ని ఉచ్చ పోసి తగల పెట్టాలంటూ హాట్ కామెంట్స్ చేశారు. ఇది రెండ్లు ఆడుతున్న డ్రామా అంటు మండిపడ్డారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో కుల గణనపై ఒకవైపు సంబరాలు జరుగుతున్నాయి. తీన్మార్ మల్లన్న మాత్రం సర్వేకు వ్యతిరేకంగా మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తాజాగా కులగణనపై తీవ్ర వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.ఓ యూట్యూబ్ చానెల్‌లో లైవ్‌లో కుల గణన నివేదికపై మాట్లాడని మలలన్న చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. కుల గణన పూర్తిగా బోగస్ అని మండిపడ్డారు. అది జానారెడ్డి సర్వే అని హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ చేసిన సర్వే వంద శాతం కరెక్ట్ అని తెలిపారు. కాంగ్రెస్ కులగణన రిపోర్టును ఉచ్చపోసి తగలబెట్టాలని దారుణంగా వా?యక్యానించారు. ఉచ్చపోస్తే కాలదు కాబట్టి వట్టిగా తగలబెడుతున్నానని లైవ్‌లోనే కాల్చారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలలెవరూ స్పందించలేదు. అంతా మౌనం వహిస్తున్నారు.

**నాలుక మడత...** జర్నలిస్టుగా.. యూ ట్యూబ్ ఛానల్ ఓనర్ గా తీన్మార్ మల్లన్న తెలుగు రాష్ట్రాల్లో ఓ సంచలనం.. స్వతంత్రంగా ఎమ్మెల్సీగా పోటు చేసి.. నాటి అధికార భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేశ్వర్ రెడ్డికి చుక్కలు చూపించాడు. ఆ తర్వాత తన ప్రయోజనాలకు అనుగుణంగా భారతీయ జనతా పార్టీలో చేరాడు. కొంతకాలానికి అందులో నుంచి బయటికి వచ్చాడు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరాడు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాడు. ఎమ్మెల్సీగా ఎన్నికైనప్పటికీ తీన్మార్ మల్లన్న ఏనాడు కూడా కాంగ్రెస్ పార్టీ వాయిస్ వినిపించలేదు. తన సొంత యూట్యూబ్ ఛానల్ లో తన వాయిస్ మాత్రమే వినిపించాడు. అవసరమైతే అధికార కాంగ్రెస్ పార్టీని విమర్శించడానికి కూడా వెనుకాడడం లేదు.. ఆమధ్య కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేయడంతో.. సొంత పార్టీ నాయకులే తీన్మార్ మల్లన్న పై విరుచుకుపడ్డారు. అయినప్పటికీ తీన్మార్ మల్లన్న తన తీరు మార్చుకోలేదు. పైగా ఇటీవల నిర్వహించిన బీసీ సభలో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఓ సామాజిక వర్గంపై కూడా తీవ్రంగా మండిపడ్డారు.. ప్రస్తుతం కొనసాగుతున్న రేవంత్ రెడ్డి చివరి రెడ్డి ముఖ్యమంత్రి అని జోస్యం చెప్పారు. 2028 లో ఖచ్చితంగా బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని.. తీన్మార్ మల్లన్న స్పష్టం చేశాడు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రకంపనలు సృష్టించాయి. ముఖ్యంగా ఓ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి..కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు.. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మల్లన్న తీవ్రస్థాయిలో విమర్శలు చేసేవాడు. అయితే అనూహ్యంగా ప్రస్తుత ప్రభుత్వం చేసిన సమగ్ర సర్వేను మల్లన్న విమర్శించాడు. ఆ సర్వే జరిగిన తీరు సహేతుకంగా లేదని మండిపడ్డాడు. అయితే కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఎన్నికైన తొలి రోజుల్లో సమగ్ర సర్వేను నిర్వహించారు. ఆ సర్వే ఎలాంటి ఫలితాలు ఇచ్చిందో తెలియదు కాని.. ఆ సర్వేను నూటికి నూరు శాతం కరెక్ట్ అని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. అయితే మంగళవారం నాటి మండలి సమావేశంలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. నాటి కెసిఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన సర్వేలో పందుల లెక్క ఎంత ఉందో చెప్పారు గానీ.. బీసీల లెక్క ఎంత ఉందో చెప్పలేదని నాలుక మడత పెట్టారు. కేవలం రోజు వ్యవధిలోనే మల్లన్న మాట మార్చడంతో సోషల్ మీడియాలో భారత రాష్ట్ర సమితి అనుకూల నెటిజన్లు ఓ ఆట ఆడుకుంటున్నారు. మల్లన్న తీరుపై మండిపడుతున్నారు. సోమవారం ఒక మాట.. మంగళవారం మరొక మాట.. ఇలా నాలుక మడత ఎందుకు పెడుతున్నావని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకుడికి మాటమీద నిలబడే సత్తా ఉండాలని.. కానీ తీన్మార్ మల్లన్న విద్యాధికుడైనప్పటికీ ఇలా వ్యవహరించడం సరికాదని దుయపడుతున్నారు. మరి దీనిపై తీన్మార్ మల్లన్న ఏ విధంగా స్పందిస్తారో చూడాల్సి ఉంది. అన్నట్టు తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా తప్పు పట్టడం విశేషం.

ఇక తెలంగాణ ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో సమగ్ర సర్వేకు సంబంధించి వివరాలను ప్రకటించింది. ఈ జాబితాలో కులాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసింది. దానిని పార్లమెంటుకు పంపించింది. దీనిపై శాసనసభలో చర్చ జరిగింది.ఈ చర్చలో తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి కేటీఆర్ ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వే మొత్తం డొల్ల అని.. సాక్షాత్తు వాళ్ళ పార్టీ ఎమ్మెల్సీ నే దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీ జనాభా తగ్గిందని.. సర్వే చేసిన విధానం బాగోలేదని కేటీఆర్ అన్నారు.. అయితే దీనికి కౌంటర్ ఇవ్వలేక అధికార పార్టీ మల్ల గుల్లాలు పడింది.. ఇదే క్రమంలో తీన్మార్ మల్లన్న ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణమయ్యాడని.. సోషల్ మీడియాలో నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చేసిన తప్పులను ఎండగట్టాడని.. ఇప్పుడు అదే తీన్మార్ మల్లన్న ప్రభుత్వానికి కంటగింపుగా మారాడని.. కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులను తీసుకొస్తున్నాడని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.. మరి దీనిపై తీన్మార్ మల్లన్న ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది. అన్నట్టు తీన్మార్ మల్లన్న బీసీ సభ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఫోటోలను భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా విభాగం తెగ ప్రచారం చేస్తోంది. అయితే అవి పాత ఫోటోలు అని తీన్మార్ మల్లన్న టీం కౌంటర్ ఇస్తోంది.. మొత్తానికి ఇరు వర్గాల మధ్య ఆరోపణలు ప్రతీ ఆరోపణలతో సోషల్ మీడియా రచ్చ రచ్చ అవుతోంది.

# తెలంగాణలో వరుస విషాదాలు

హైదరాబాద్ : తెలంగాణలోని వరుస విషాదాలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హాస్టల్ భవనంపై నుంచి దూకి పశ్చిమ బెంగాల్ కు చెందిన యువతి ఆత్మహత్య చేసుకుంది. మరో పక్క హైదరాబాద్ లోని ఎల్బీనగర్ లో సెల్లార్ నిర్మాణం కోసం తవ్వకాలు జరుగుతుండగా గోడ కూలి ముగ్గురు కూలీలు మృతి చెందారు.గచ్చిబౌలిలోని సిద్ధిక్ నగర్ లోని ఓ హాస్టల్ భవనంపై నుంచి దూకి పశ్చిమ బెంగాల్ కు చెందిన రితోజి బసు అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. ఘటన అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. ఆ తర్వాత శవ పరీక్ష నిమిత్తం యువతి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలోనే మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

**గోడ కూలి ముగ్గురు కూలీలు మృతి...** హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్ లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఓ హోటల్ సెల్లార్‌లో తవ్వకాలు జరుపుతుండగా గోడ కూలింది. దీంతో మట్టిపెడ్డల మీద పడి ముగ్గురు కూలీలు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది స్పాట్‌కి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. గాయపడ్డ వ్యక్తిని శిథిలాల నుంచి సురక్షితంగా బయటకు తీసి, చికిత్స కోసం కామినేని ఆస్పత్రికి తరలించారు. మృతులంతా బీహార్ కు చెందిన వారుగా గుర్తించారు. కాగా చనిపోయిన వారి మృతదేహాలను సైతం రెస్క్యూ సిబ్బంది వారిపై పడ్డ మట్టి దిబ్బలను తొలగించి బయటకు తీశారు. ప్రాథమిక వివరాల ప్రకారం, ఓ భవన నిర్మాణానికి సంబంధించి ఇక్కడ సెల్లార్ పనులు జరుగుతున్నాయి. ఇక ఈ విషయానికి సంబంధించిన సమాచారమందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

**కెమికల్ ఫ్యాక్టరీలో ఫైర్ యాక్సిడెంట్**

అంతకుముందు ఫిబ్రవరి 4న రాత్రి చర్లపల్లి కెమికల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగింది. చుట్టుపక్కల పరిశ్రమలకు మంటలు అంటుకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. రసాయనాల ఘాటుతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా ఈ మంటలు వ్యాపించడానికి గల కారణాలు మాత్రం ఇంకా వెల్లడి కాలేదు.

# ఉచిత ఇసుక పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కులు

**- నిజమైన లబ్దిదారులకు ఉచిత ఇసుక అందే వరకు పోరాటం చేస్తాం**

**- మన సంపద సరిహద్దులు దాటి పొరుగు రాష్ట్రాలకు తరలి పోకూడదన్నదే ప్రధాన ఉద్దేశ్యం**

**- చెక్ పోస్టులు, ఇసుక రీచ్ ల పరిశీలనలో - సిపిఐ**

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో పలు ఇసుక రీచ్ లు మరియు సరిహద్దు చెక్ పోస్ట్ లను యన్.టి.ఆర్ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ నాయకత్వాన సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో గల ప్రభుత్వ అనుమతులు లేని ఇసుక రీచ్ లను పరిశీలించడం జరిగింది. ఈ పర్యటనలో భాగంగా లింగాల,కన్నెవీడు, ఇందుగపల్లి, మల్కాపురం,గండ్రాయి గ్రామాల మీదుగా ఇందుగపల్లి ఇసుక రీచ్ ని వారు మరియు గండ్రాయి,నేషనల్ హైవే 65 పై వద్ద గల సరిహద్దు చెక్ పోస్ట్ లను పరిశీలించడం జరిగింది. జగ్గయ్యపేట పట్టణంలో గల సిపిఐ పార్టీ పిల్లలమర్రి భవన్ లో పాత్రికేయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పథకాని ప్రవేశ పెట్టారు. దీనిలో యన్.టి.ఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులు లేని ఇసుక రీచ్ ల నుండి ఉచిత ఇసుకను కొందరు నాయకులు వారి అనుచరులు కలిసి సరిహద్దు రాష్ట్రానికి అక్రమంగా ఉచిత ఇసుకను తరలిస్తున్నారని, జగ్గయ్యపేట పోలీస్ సర్కిల్ పరిధిలో ఇప్పటికే 55 కేసులు నమోదు చేయడం జరిగిందని పోలీసు వారు పెరుకొనటమే మా పోరాటానికి నిదర్శనం అని అన్నారు. ఆ సందర్భంలో సరిహద్దు ప్రాంతంలో ఉన్న గండ్రాయి చెక్ పోస్ట్ ల వద్ద భూభారి గేట్లు నిరుపయోగంగా ఉన్నాయని, ఉన్న ఒక్క సిసి కెమెరా పనిచేయకపోతే అక్రమ రవాణా సుసాధ్యం అవుతుందని, దీని పైన పోలీసు శాఖ దృష్టి పెట్టాలని అన్నారు. నేషనల్ హైవే 65 పై చెక్ పోస్ట్ వద్ద గల నిఘా నేత్రలు వాహనాలను చూడాలే తప్ప,భూమి వైపు చూడటం సరికాదన్ని ,మరింతగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఉచిత అక్రమ రవాణా నివారించడానికి అవసరమైతే అఖిల పక్షం ఏర్పాటు చేసి, అక్రమార్కుల భరతం పట్టాలని అన్నారు. కమ్యూనిస్టులు ప్రజల కోసం పనిచేసే వారేని,ప్రజల సహకారంతో ప్రజా ఉద్యమాలు చేపడుతామని అన్నారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలలో సహజ వనరులను ఎవ్వరు దోపిడి చేసిన సిపిఐ సహించదని, ప్రస్తుతం సిపిఐ పోరాటం వల్ల అక్రమ రవాణా ఆగిందని,భవిష్యత్తు లో ఇసుక అక్రమ రవాణాని ఎవ్వరు చేస్తున్న సిపిఐ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్లు ఇసుక అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు మరియు జిల్లా సిపిఐ నాయకులు బుట్టి రాయప్ప, జిల్లా భవన నిర్మాణ కార్యదర్శి సోనా రాజు, జిల్లా ఏవైయఫ్ అధ్యక్ష, కార్యదర్శి కరిసే మధు,లంకా గోవింద రాజులు,సామాజిక కార్యకర్త పల్లేటి కౌమిది,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గోడెల జనార్థన్,జగ్గయ్యపేట నియోజకవర్గ,పట్టణ సిపిఐ నాయకులు షేక్ అసదుల్లా,బోగ్యం నాగులు,మెటికల శ్రీనివాసరావు,వై భాను, వత్సవాయి మండలం కార్యదర్శి షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఎయిర్ పోర్టుకు లైన్ క్లియర్

ఖమ్మం : దేశవ్యాప్తంగా 120 కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయబోతున్నట్లు.. తాజా బడ్జెట్‌లో కేంద్రం స్పష్టం చేసింది. దీంతో కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఆశలు బలపడుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే దీని నిర్మాణానికి అడుగులు పడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇటు తెలంగాణ ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి పెట్టింది. దీనికి సంబంధించిన ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.ఎయిర్‌పోర్టు స్థల పరిశీలనకు తెలంగాణ ప్రభుత్వం రూ.38లక్షలు మంజూరు చేసింది. ఇటీవలే టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ సర్వే పూర్తయ్యింది.. కొత్తగూడెం జిల్లా కేంద్రానికి సమీపంలోని రామవరం- గరీబ్‌పేట గ్రామాల మధ్య ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం భూమిని కేటాయించింది. చుంచుపల్లి, కొత్తగూడెం, సుజాతనగర్ మండలాల్లో ఈ ప్రాంతం విస్తరించి ఉంది.ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలాన్ని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఇటీవల పరిశీలించారు. కేంద్ర బృందం పర్యటనతో ఈ ప్రాంత వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.గతంలో కూడా ఈ ప్రాంతంలోని లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక, పాల్వంచ మండలం గుడిపాడు- బంగారుజాల మధ్య ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు పలుమార్లు సర్వే చేశారు. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదు.ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ప్రభుత్వం 954 ఎకరాలు కేటాయించింది. దీంట్లో కేవలం 200 ఎకరాలు మాత్రమే ప్రజల నుంచి తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మిగతాది ప్రభుత్వ భూమే అని వివరిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవరోధాలు లేవు. ముఖ్యంగా చెరువులు, కుంటలు, గుట్టలు వంటివి లేకపోవటం కలిసొచ్చే అంశం అని జిల్లా అధికారులు చెబుతున్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రాంతం నాలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉంది. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, సారపాక తదితర పారిశ్రామిక ప్రాంతాలకు ఎయిర్‌పోర్టు నిర్మాణంతో రాకపోకలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. సుజాతనగర్ మండలంలో 197, కొత్తగూడెంలో 750, చుంచుపల్లి మండలంలో 7 ఎకరాలను ప్రభుత్వం విమానాశ్రయానికి కేటాయించింది. తెలంగాణలో ఆరు రీజినల్ ఎయిర్‌పోర్టులు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. భద్రాచలం పుణ్యక్షేత్రానికి దేశ నలుమూలల నుంచి భక్తులు రావటానికి ఈ విమానాశ్రయం ఉపయోగపడుతుందని స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

# ఈ సమ్మర్ చాలా హాట్ గురూ

విజయవాడ : గత కొన్నిరోజులుగా తెలుగు రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఏపీలో ఎండలతో ఉక్కపోత పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జనవరి చివరి వారం నుంచే మార్చి నెలాఖరులో ఉండే ఎండలను చూసి అప్పుడే వేసవి కాలం వచ్చేసిందా అంటూ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఫిబ్రవరి తొలి వారంలోనూ అధిక ఉష్ణోగ్రతలు చూసి.. ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో తమ పరిస్థితి ఏంటని రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్చి నెల నుంచి వడగాల్పులు మొదలయ్యే అవకాశం ఉంది.అటు తెలంగాణలోనూ కొన్ని రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంది. హైదరాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు అప్పుడే 34 డిగ్రీల మేర నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ లో 37 డిగ్రీలు, భద్రాచలంలో 36.8, ఖమ్మం, మహబూబ్ నగర్ లలో 36.4 డిగ్రీలు, నిజామాబాద్ లో 36 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలికాలంలోనూ ఎండ తీవ్రతకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉష్ణోగ్రత సగటున ఒక డిగ్రీ మేర పెరిగితే మరణాలు 0.2 శాతం నుంచి 5.5 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.

అత్యంత వేడి సంవత్సరంగా 2024

భూతాపం కారణంగా గత దశాబ్దం, 15 ఏళ్లలో పలుమార్లు ఎండలు రికార్డు సృష్టించాయి. 2010 నుంచి 2024 మధ్యకాలంలో అత్యంత వేడి సంవత్సరాలుగా పదేళ్లు రికార్డు నెలకొల్పాయంటే ఎండల తీవ్రత ఎలా పెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అత్యంత వేడి దశాబ్దంగా 2015- 2024 నిలిచింది. అత్యంత వేడి సంవత్సరంగా 2024 రికార్డు సృష్టించిందని తెలిసిందే. ఈ ఏడాది సైతం భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ సంస్థ తెలపడంతో ప్రజలు టెన్షన్ పడుతున్నారు.

మరోవైపు శీతాకాలంలో చలి తీవ్రత తగ్గిపోయి, అసాధారణ వేడి ఉంటుందని వాతావరణశాఖ చెబుతోంది. రానున్న రోజుల్లో వేడిని తట్టుకోలేని పరిస్థితి నెలకొంటుందని, కనుక ప్రజలకు చెట్ల పెంపకాన్ని సూచిస్తోంది.

ఏపీ సహా పలు రాష్ట్రాల్లో భారీ ఉష్ణోగ్రతలు

కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలలో అసాధారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని హెచ్చరించారు. చిరు జల్లులు కురిసే అవకాశం ఉండటంతో ఢిల్లీకి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అసలే ఢిల్లీలో నేడు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఇళ్ల నుంచి బయటకు రానున్నారు. బాపట్ల, నందిగామ, కావలి, కర్నూలులో మంగళవారం భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వీటితో పాటు కాకినాడ, మచిలీపట్నం, తుని, నరసాపురం తదితర ప్రాంతాల్లో నిన్న ఒకేరోజు ఏకంగా 3 నుంచి 6 డిగ్రీలు మేర గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం కలవరపెడుతోంది. అసలే ఏపీలో పలు జిల్లాలకు తీర ప్రాంతం ఉండటంతో ఎండ వేడి కంటే, హ్యూమిడిటీ సమస్య అధికంగా ఉంటుందని తెలిసిందే. కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమలోనూ ఫిబ్రవరి రెండో వారంలో 2 నుంచి 4 డిగ్రీలు మేర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని ఆ ప్రాంత ప్రజలను ఐఎండీ అలర్ట్ చేసింది.

# 58: 42 వాటానే.. తేల్చి చెప్పిన కేంద్రం



న్యూఢిల్లీ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు విడిపోయి దశాబ్ద కాలం దాటింది. అయినా సరే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల పంపకాల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని షెడ్యూల్ 9, 10లో ఉన్న సంస్థల విభజన విషయంలోనే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎడతెగని పేచీ నెలకొంది. రాష్ట్రాలు, విభజన వ్యవహారాలపై నోడల్ ఏజెన్సీగా వ్యవహరించే కేంద్ర హోంశాఖ ఈ అంశంపై పలుమార్లు అనేక సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకపోయింది.కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన హైలెవెల్ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ కే. విజయానంద్, తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి సహా రెండు రాష్ట్రాల నుంచి ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో ఆస్తులు, అప్పుల పంపకాల విషయంలో పట్టువిడుపు ధోరణి ప్రదర్శించాలని రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్రం హితవు పలికింది. మొండిగా వ్యవహరిస్తే ఫలితం లేదని, కోర్టుకు వెళ్లినా జాప్యం తప్ప మరేమీ ఉండదని సుతిమెత్తగా మొట్టికాయలు వేసింది. తదుపరి సమావేశం నాటికి షెడ్యూల్ 9, 10లో పొందుపరిచిన సంస్థల విభజన విషయంలో లీగల్ ఒపీనియన్‌తో రావాలని, వాటి పంపకాలకు సిద్ధంగా ఉండాలని సూచించింది. సమన్వయం, ఏకాభిప్రాయం, పట్టువిడుపు ధోరణితోనే అపరిష్కృత అంశాలకు పరిష్కారం వెతకాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సూచించారు.రాష్ట్రాల విభజన అన్నాక ఉమ్మడి ఆస్తులు, అప్పులను కూడా పంచుకోవాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విభజించే క్రమంలో ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన వంటి అంశాల్లో జనాభా దామాషా నిష్పత్తిని అనుసరించారు. అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న జనాభా ప్రకారం 58:42 నిష్పత్తిలో.. అంటే 58 శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌కు, 42 శాతం వాటా తెలంగాణకు దక్కేలా ప్రతిపాదనలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఉద్యోగులు, రాష్ట్రంలో ఉన్న ఉమ్మడి ఆస్తులు, రాష్ట్రం వెలుపల ఉన్న ఉమ్మడి ఆస్తులు, విద్యా సంస్థలు, ఉమ్మడి రుణాలు వంటి అనేకాంశాలను ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో పొందుపరిచి, వాటిని ఎలా విభజించుకోవాలో సూచించారు. ఈ ప్రకారం ఇప్పటికే అనేక ప్రభుత్వ విభాగాలు, వాటిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, ఉమ్మడి నిధులు వంటివన్నీ విభజించుకుని పదేళ్లుగా ఎవరికి వారు పరిపాలన చేసుకుంటున్నారు. అయితే విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లో పొందుపరిచిన ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజన విషయంలోనే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఈ రెండు షెడ్యూళ్లలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ వంటి పదుల కొద్ది సంస్థలు ఉన్నాయి. వీటిలో చాలా సంస్థల విభజన పూర్తయినప్పటికీ.. రెండు షెడ్యూళ్లలో పొందుపరిచిన సుమారు 20 సంస్థల విభజన విషయంలోనే పేచీ నెలకొంది. వివాదాస్పదంగా ఉన్న సంస్థల్లో మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్, తెలుగు అకాడమీ, ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ వంటి సంస్థలు ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం షీలా బెడె నేతృత్వంలో కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసి విస్తృత సంప్రదింపుల తర్వాత కొన్ని సిఫార్సులు కూడా చేసింది. అయినా సరే.. రెండు రాష్ట్రాలు తమ వైఖరి విషయంలో మొండిపట్టుతో ఉన్నాయి.చాలా సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా ఉండడంతో వాటికి సంబంధించిన స్థిరాస్తులు సైతం తెలంగాణ భూభాగంలోనే ఉన్నాయి. వీటితో పాటు ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్, కార్పొరేషన్లను విభజించే క్రమంలోనే పేచీ ఏర్పడుతోంది. ఆస్తుల్లో ఎక్కువ వాటా,అప్పుల విషయానికి వచ్చేసరికి తమకు సంబంధం లేదు అన్నట్టుగా రెండురాష్ట్రాలు ప్రవర్తిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వైఖరిపైనే కేంద్ర హోంశాఖ అసహనంగా ఉంది. అందుకే హైలెవెల్ మీటింగ్‌లో పట్టువిడుపులు, ఇచ్చిపుచ్చుకొనే ధోరణి ప్రదర్శించాలని హితవు పలికింది.

# ఢిల్లీ టూర్‌లో మంత్రి లోకేష్ బిజీ

న్యూఢిల్లీ : ఢిల్లీ టూర్‌లో బిజి బిజీగా ఉన్నారు మంత్రి నారా లోకేష్. కేంద్ర బడ్జెట్ ఐపోవడంతో నిధులు, ప్రాజెక్టులు రాబట్టేందుకు తీవ్రంగా ఫోకస్ చేస్తోంది చంద్రబాబు సర్కార్. ఈ క్రమంలో మంత్రి నారా లోకేష్ ఢిల్లీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. కేంద్రమంత్రులతో నిత్యం సమావేశమవుతూ రాష్ట్రానికి రావాల్సిన దానిపై చర్చిస్తున్నారు. బుధవారం ఉదయం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు.

రాజకీయాలతోపాటు అభివృద్ధి పనులపై మాట్లాడారు. అదే సమయంలో పార్టీ ఎంపీలు, టీడీపీకి చెందిన కేంద్రమంత్రులను ఆయనకు పరిచయం చేశారు మంత్రి లోకేష్కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. డిఫెన్స్ రంగం పరికరాల తయారీలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు వస్తున్న నేపథ్యంలో కొన్ని యూనిట్లు తమ రాష్ట్రానికి వచ్చేలా సహకరించాలని కోరారు. కేంద్రం సహకారంతో రాజధాని అమరావతి పనుల పురోగతి, పోలవరం పనులు సాగుతున్న తీరును రాజ్‌నాథ్‌కు తెలిపారు. ఏపీకి ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ అనే నినాదంతో పని చేస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి లోకేష్. ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌లు, పారిశ్రామిక వాతావరణాన్ని అభివృద్ధి చేయడంపై కేంద్రమంత్రులతో చర్చించి నట్టు మీడియాతో చెప్పారు. అమెరికాలో పర్యటించినప్పుడు తన దృష్టికి వచ్చిన కంపెనీల ఫీడ్ బ్యాక్ గురించి మంత్రులకు వివరించారు. రైల్వే మంత్రి వైష్ణవ్ త్వరలో విశాఖ, తిరుపతిలలో పర్యటించి, చేపట్టిన పనులను స్వయంగా చూస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులను ఏపీకి తీసుకురావడానికి కల్పించాల్సిన వాతావరణంపై చర్చించినట్టు వివరించారు. ముఖ్యంగా డేటా సిటీల కోసం ఏటా ప్రపంచ వ్యాప్తంగా 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నారు. అందులో 100 బిలియన్ డాలర్లు ఇండియాకు వచ్చే వీలుంది. మెజార్టీ వాటా ఏపీకి రావాలన్న స్వార్థం తనకు ఉందన్నారు మంత్రి లోకేష్.మరో రెండు నెలల్లో వైజాగ్‌లో టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని చెప్పారు మంత్రి. శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు భూమి కోసం అన్వేషణ జరుగుతోందని వివరించారు. కాగ్నిజెంట్ ఏర్పాటుపై త్వరలో ప్రకటన వస్తుందని, ఏడాదిలో ఒక్కో ప్రాజెక్టును ఏర్పాటు చేసుకుంటూ వెళ్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో రాబోతున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఏపీ సిద్ధంగా ఉందని, అందుకు కేంద్రం సహకారం కావాలని కోరినట్టు తెలిపారు.

## పార్లమెంట్లో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లలను తక్షణమే రద్దు చేయాలి

### - కేంద్ర బడ్జెట్ పత్రాలు దగ్ధం చేసిన వామపక్ష కార్మిక సంఘాల నేతలు

దేవనకొండ : కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు ఏఐటీయూసీ, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్లో నిరసన తెలియజేసి కేంద్ర బడ్జెట్ పత్రాలను దగ్ధం చేయడం జరిగింది కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి. వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఏం. నరసరావు లు మాట్లాడుతూ... లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అన్నారు. స్వాతంత్రం ముందు నుంచి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినదని కోవిడ్కాలంలో దుర్మార్గంగా పార్లమెంట్లోనూ బయట ఎటువంటి చర్చ జరగకుండా 2019 వేతనాలు కోడును 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్ను సామాజిక భద్రత, వృత్తి భద్రత ఆహారం మరియు పని పరిస్థితుల కోడు ల ను ఆమోదించింది. రెండు రోజుల్లో రాష్ట్రపతి ఆమోదముద్ర పొందింది, రూల్స్ ఆమోదించి మోదీ ప్రభుత్వం ఎప్పుడైనా అమలు చేయడానికి సిద్ధంగా ఉ ందని అన్నారు. కార్మిక వర్గానికి ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్ల ముఖ్య ఉద్దేశం అని కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాలు అమలు జరిపితే తిరుగుబాట్లు అని వార్యం అన్నారు. సమ్మెలు చేయకుండా నిబంధనలు లేబర్ కోడులో తీవ్రతరం చేశారని ఆరోపించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ బోనస్ కనీస వేతనాలు లాంటి ప్రాథమిక చట్టాలు అమలు అధోగతి పట్టిందన్నారు. కావున తక్షణమే4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ భాష, ఏఐటియుసి, సిఐటియు కార్మిక సంఘాల నేతలు బడే సాహెబ్ రాఘవేంద్ర లక్ష్మణస్వామి మా భాష కృష్ణ రామాంజి తదితరులు పాల్గొన్నారు

## ఇంచార్జ్ ఏడి ఇష్టారాజ్యం

వరంగల్ : హనుమకొండ మైనింగ్ శాఖలో ఇన్చార్జి ఏ డి ఇష్టారాజ్యం కొనసాగుతుందన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి గత రెండు నెలల క్రితం హనుమకొండ మైనింగ్ శాఖ ఏడి సెలవు పై వెళ్లడంతో వరంగల్ ఏ డి అదనపు బాధ్యతలు తీసుకున్నట్లు తెలిసింది దీంతో దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి అన్న రీతిలో ఆయన అవినీతి బాగోతానికి తెరలిపినట్లు జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు ఎవరేమనుకుంటే నాకేమి లే అన్న రీతిలో ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అనుమతులు లేకుండా నడుపుతున్న క్రషర్ యజమానుల వద్ద అడ్డగోలుగా మామూలు దండుకున్నట్టు జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు హనుమకొండ జిల్లాలోని కాజీపేట మండలంలో గల శ్రీరామాంజనేయ స్టోన్స్ క్రషర్ పరిధికి మించి పనులు జరుగుతున్న మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు ఎందుకు ఉంటున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ప్రతినెల ఆ క్రషర్ యజమాని తీసుకునే పరిమిట్ల కంటే ఎక్కువ మొత్తంలో మైనింగ్ చేస్తూ ఉన్నప్పటికీ అధికారులు ఉ దాసీనంగా ఉండడం వెనుక కారణాలు ఏమిటంటే ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు శ్రీ రామాంజనేయ క్రషర్ నిర్వహణకు సరైన రీతిలో అనుమతులు లేకున్నా చర్యలకు మైనింగ్ శాఖ అధికారులు చర్యలు ఎందుకు తీసుకుంటాలేరని ప్రశ్నిస్తున్నారు సర్వేనెంబర్ 69 లో ఉన్న పరిధికి మించి తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు ఎన్నోసార్లు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు మామూళ్ల మత్తులో ఉండి తూతూ మంత్రంగా తనిఖీలు చేసి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ప్రభుత్వ వనరులను కాపాడవలసిన మైనింగ్ శాఖ అధికారులు మామూలు మత్తులో తూలుతూ ప్రజాధనానికి గండి కొడుతున్నారని మండల ప్రజల ఆరోపిస్తున్నారు సంబంధిత అధికారులు శ్రీరామాంజనేయ స్టోన్ క్రషర్ పై తనిఖీ చేసి గత కొంతకాలంగా అనుమతులకు తీసిన దానిపై సర్వే చేసి చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు పరిధికి మించి తీసిన మెటల్ పై పెనాల్టివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు 149 పోలింగ్ స్టేషన్లు

గుంటూరు : ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రతిపాదించిన ఆగ్జలరీ పోలింగ్ కేంద్రాలను రాజకీయ పార్టీలు పరిశించి, ఖరారు చేస్తే జాబితాను ప్రధాన ఎన్నికల అధికారికి పంపిస్తామని రిటర్నింగ్ అధికారి అయిన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు.గుంటూరు జిల్లాలో ఇప్పటికే 118 పోలింగ్ కేంద్రాలున్నాయని వాటిలో వెయ్యి ఓట్లకు పైగా పోలింగ్ స్టేషన్లకు అదనంగా వేరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయటానికి 39 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామని చెప్పారు. ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్ఓలతో చర్చించి, 8 ఆగ్జలరీ పోలింగ్ కేంద్రాలను తగ్గించామని తెలిపారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం 149 పోలింగ్ స్టేషన్ల జాబితాను సిఈఓకు పంపించడానికి ఏఆర్ఓలు వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. మిగిలిన ఏలూరు, కృష్ణ, ఎన్టిఆర్ బాపట్ల, పల్నాడు జిల్లాలో ఆగ్జలరీ పోలింగ్ కేంద్రాల వివరాలు అందిన తర్వాత నియోజకవర్గానికి సంబంధించి మొత్తం పోలింగ్ కేంద్రాలను ప్రకటిస్తామని చెప్పారు.

## కాళేశ్వరంలో ఘనంగా కుంభాభిషేఖం నిర్వహించాలి

జయశంకర్ భూపాలపల్లి : కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరంలో ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభి షేకం మహోత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో కుంభాభి షేకం మహోత్సవాలు నిర్వహణపై దేవాదాయ, పంచాయతి రాజ్, విద్యుత్, వైద్య, ఇరిగేషన్, పోలీస్, అగ్నిమాపక, ఆర్టీసీ, సమాచార శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం బస్టాండ్ నుండి గోదావరి నది వరకు మరియు బస్టాండ్ వద్ద గల దేవస్థానం ఆర్చి గేటు నుండి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ముందుగల ఆర్చ్ గేట్ వరకు మరియు దేవస్థానం బయట ఆవరణ మొత్తం ప్రత్యేక స్వీపర్లను నియమించి ప్రతిరోజు పారి శుద్య కార్యక్రమాలు చేపట్టాకని సూచించారు. కుంభాభిషేకం జరుగు (3) రోజులు ప్రధాన ఘాట్ మరియు విఐపి ఘాట్ వరకు మొత్తం ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను నియమించి పరిశుభ్రత పనులు చేపట్టాలని ఆదేశించారు. 5వ తేదీ నుండి పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభించాలని తెలిపారు. మహదేవపూర్ నుండి కాళేశ్వరం వరకు రహదారిపై ప్రమాదకరముగా ఉన్న గుంతలను పూడ్చాలని సూచించారు. 7 నుండి 9 వ తేదీ వరకు 3 రోజులు అత్యవసర వైద్య సేవలు నిమిత్తము అన్ని సదుపాయములతో కూడిన మెడికల్ క్యాంపు పాత దేవస్థానం కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో ముందు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరి నది వద్ద మరియు దేవస్థాన ప్రాంగణములో భక్తులకు మంచినీటి వసతికి గాను ఆర్.ఓ. వాటర్ డ్రమ్ముల ద్వారా మంచినీటి సౌకర్యాలు కల్పన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆలయ వెనుక భాగంలో గల మరుగు దొడ్లను వినియోగం లోకి తేవాలని ఆదేశించారు. పోలీస్ శాఖ 3 రోజులు శాంతి భద్రతల నిర్వహణ మరియు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 9వ తేదీ ఉదయం 10.42 గంటలకు కుంభాభిషేకం చేయుటకు పీఠాధిపతులు, వేద పండితులు, విఐపిలు గోపురాల పైకి మరియు ప్రధాన దేవాలయముల పైకి వెళ్లాల్సి ఉన్నదని ఆ సమయంలో రద్దీ తో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించాలని సూచించారు.మత్స్య శాఖ ద్వారా గోదావరినది వద్ద 10 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. ప్రమాదకరమైన స్థలాలను గుర్తించి ప్రమాద హెచ్చరికల ఎర్ర జెండాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అగ్నిమాపక వాహనము ద్వారా నీటితో ఆలయ 4 గోపురములు శుద్దీకరణ చేయాలన్నారు..నీటి పారుదల శాఖ గోదావరి నదిలో డేంజర్ జోన్లను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలిక నీటి షవర్లను వృద్ధుల, చిన్న పిల్లల సౌకర్యార్థమై ఏర్పాటు చేయాలని తెలిపారు. స్త్రీలు బట్టలు మార్చుకొనుటకు తాత్కాలిక గదులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ ద్వారా కుంబాభిషేకం జరుగు 3 రోజులు వివిధ ప్రాంతముల నుండి కాళేశ్వరమునకు ప్రత్యేక ఆర్.టి.సి.బస్సుల సౌకర్యము ఏర్పాటు చేయాలన్నారు. కుంబాభిషేకం జరుగు 3 రోజులు కాళేశ్వరము గ్రామమునకు మరియు దేవాలయమునకు 24 గంటలు నిరాటంకముగా విద్యుత్ సౌకర్యము కల్పించాలని సూచించారు. ప్రత్యామ్నయ సరఫరాకు ఏర్పాటు చేయాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవచన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

# ఫ్రస్టేషన్లో మావోయిస్టులు

### ఇన్ ఫార్మర్లను చంపేస్తున్న నేతలు



వరంగల్ : గత కొన్ని నెలలుగా తగులుతున్న ఎదురు దెబ్బలకు మావోయిస్టులు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయారు. ఒక విధంగా చెప్పాలంటే ఏం చేయాలో అర్థంకాని స్థితి లోకి వెళ్లిపోయారు. ఆ ఫ్రస్టేషన్ గత కొన్ని నెలలుగా సామాన్యులపై తీర్చుకుంటున్నారు. మావోయిస్టుల ఇన్ఫర్మేషన్ పోలీసులకు అందిస్తున్నారని అనుమానిస్తున్నారు. అందుకే అనుమానం ఉన్న వారందర్నీ కాల్చి చంపుతున్నారు. తాజాగా మావోయిస్టులు మరోసారి ఇన్ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనులను హతమార్చారు. ఛత్తీస్గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని టార్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. తమ వారిని చంపేందుకు వీళ్లు సహకరిస్తున్నారని మావోయిస్టులు ఈ హత్యలకు తెగపడ్డారు. తలాబ్ పారా బుడ్గి ప్రాంతంలో నివాసముండే కరమ్ రాజు (32), మద్వి మున్నా (27) అనే ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. వీళ్లే తమ పార్టీకి చెందిన నేతలు ఉండే ప్రాంతాల సమాచారాన్ని పోలీసులకు అందిస్తున్నారనే నెపంతో ఈ దురాఘతానికి పాల్పడ్డారు. మద్వి మున్నా, కరమ్ రాజు ఇళ్లలోకి అర్ధరాత్రి చొరబడి మావోయిస్టులు పదునైన ఆయుధాలతో అతి కిరతకంగా గొంతు కోసి హత్య చేశారు. కుటుంబం సభ్యుల ముందే మావోయిస్టులు ఈ దారుణానికి పాల్పడ్డారు. తమ వారికి ఏ పాపం తెలియదు వదిలి పెట్టాలని వేడుకున్నా విడిచిపెట్టలేదు. వారు కాళ్లావేళ్ల పడినా కనికరించలేదు. హత్యలు చేసిన తర్వాత మావోయిస్టులు స్పాట్లో లేఖలు విడిచి పెట్టి వెళ్లారు. ఈ ఘటనతో బీజాపూర్ ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గిరిజనుల హత్యను పోలీసులు కూడా ధృవీకరించారు. ఘటనపై టార్రెమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 2రోజుల వ్యవధిలోనే మావోయిస్టులు పోలీస్ ఇన్ ఫార్మర్ నెపంతో ముగ్గురిని హత్య చేశారు. ఆదివారం తెల్లవారు జామున మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా బహదూర్ ఘాట్ తాలుకలో మాజీ ఎంపిటీసీ మాడవ్వి (45) ని ఇలానే దారుణంగా హత్య చేశారు మావోయిస్టులు. పోలీస్ ఇన్ ఫార్మర్గా మారి దళాల సమాచారాన్ని పోలీస్కు అందిస్తున్నారని నెపంతో మాడవ్వి చితకబాది హత్య చేశారు. వరుస ఘటనలతో ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర దండకారణ్యంలో గిరిజన గూడేలు భయంతో వనికి పోతున్నాయి. వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టులు పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. దీనికి దళాల సమాచారం పోలీస్లకు లీక్ కావడమే కారణమని మావోయిస్టులు భావిస్తున్నారు. అందుకే ఇలా ఊళ్లపై పడి హత్యలకు పాల్పడుతున్నారు. ఈ భయంతోనైనా ప్రజలు తమ సమాచారాన్ని పోలీసులకు ఇవ్వకుండా ఉంటారని అనుకుంటున్నారు

# చల్లటి బీరులో చెత్త

కరీంనగర్ : కూల్ కూల్ బీరు అందుకున్నాడు. ఫ్రెండ్స్ తో కూర్చున్నాడు. సినిమా స్టైల్ లో బీరు సీసా ఓపెన్ చేశాడు. ఇంకేముంది అతని నాలుక రపరపమంది. ఒక చుక్క గొంతులో వేసుకున్నాడు. ఏదో టేస్ట్ తేడాగా ఉండడంతో, మళ్లీ సీసాలో చూశాడు, ఇంకేముంది పరుగుపరుగున వైన్స్ షాప్ వద్దకు చేరుకున్నాడు. పాపం అంతలోనే ఏం జరిగిందని అనుకుంటున్నారా.. అయితే ఈ కథనం చదవాల్సిందే.ఓ యువకుడు ఆశగా బీరు సీసా కొనుగోలు చేసి చివరకు ఖంగుతిని, ఏకంగా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసేవరకు వెళ్లాడు. అంతలా ఆ బీరు ప్రియుడికి కోపం రావడానికి పెద్ద కారణమే ఉంది. అయితే సదరు వైన్స్ షాపు యజమాని ఇచ్చిన సమాధానంతో ఆగ్రహం వ్యక్తం చేసిన యువకుడు ఫిర్యాదు వరకు వెళ్లాడు. ఎట్టకేలకు అధికారులు కూడ ఆ బీరులోని కాన్త సేకరించి శాంపిల్స్ కు వంపించేందుకు సిద్ధమవుతున్నారుపెద్దపల్లి జిల్లా రంగం పల్లి లోని శ్రీ వెంకటేశ్వర వైన్స్ లో శ్రీనివాస్ అనే యువకుడు బీరు కొనుగోలు చేశాడు. స్నేహితులతో కలిసి తాగేందుకు సిద్ధమయ్యాడు. అంతలోనే బీరు లో ఉన్న చెత్తను గమనించి షాక్ కు గురయ్యాడు. అప్పటికే కొంత బీరు తాగిన యువకుడు స్థానిక వైన్స్ షాపు నిర్వాహకులను నిలదీశాడు.తమకు సంబంధం లేదని యాజమాని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారట. దీంతో శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. షాంపిల్ సేకరించి ల్యాబ్ పంపుతామని ఎక్సైజ్ అధికారులు తెలిపినట్లు సమాచారం. జిల్లాలో తరుచూ ఇలాంటి ఘటనలే చోటు చేసుకుంటుండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.ఒకటి కాదు రెండు కాదు ఇటీవల ఇలాంటి ఫిర్యాదులు కోకొల్లలు వస్తున్నాయని బీరు ప్రియులు ఆరోపిస్తున్నారు. మరి తయారీలో తేడా జరుగుతోందా? లేక మరెక్కడైనా తప్పు జరుగుతుందా అన్నది ఎక్సైజ్ శాఖ అధికారులు తేల్చాల్సి ఉ ంది. రానున్నది ఎండాకాలం. బీర్లకు గిరాకీ ఎక్కువ. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కూడ, నాణ్యతా ప్రమాణాలు పాటించని బీర్ల యాజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది. ఇప్పటికైనా బీరు త్రాగే వారు తస్మాత్ జాగ్రత్త.. ఒకసారి చెక్ చేయండి.. లేకుంటే ప్రాణాలు పోతాయని హెచ్చరిస్తున్నాడు శ్రీనివాస్.

# 10 స్థానాలకు ఉపఎన్నికలు... తప్పవా?

హైదరాబాద్ : తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్పై గెలిచిన ఎమ్మెల్యేలు పది మంది తర్వాత పరిణామాలతో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరినీ అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ నేతలు పోరాటం చేస్తున్నారు. అసెంబ్లీ స్పీకర్కు ముందుగా ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు.. తర్వాత హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో కేటీఆర్తోపాటు పలువురు సుప్రీ కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని అసెంబ్లీ సెక్రెటరీని ఆదేశించింది. ఈ సందర్భంగా ఘాటు వ్యాఖ్యలు కూడా చేసింది. అనర్హతపై ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారు.. ఎంతకాలం పడుతుందని ప్రశ్నించింది.సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీ సెక్రెటరీ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే నోటీసుల్లో ఎప్పట ఇవరకు వివరణ ఇవ్వాలో పేర్కొనలేదని సమాచారం. మరోవైపు నోటీసులు అందుకున్న పది మంది ఎమ్మెల్యేలు తమకు గడువు కావాలని కోరినట్లు సమాచారం.ఇదిలా ఉండగా సుప్రీ కోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 10వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా వివర ణ ఇవ్వాలని నోటీసులు జారీ అయ్యాయి. నోటీసులు జారీ అయిన వారిలో దానం నాగేందర్, తెల్లాం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్రెడ్డి, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, గూడెం మహిపాల్రెడ్డి, సంజయ్కుమార్, బండ్ల కృష్ణమోహన్రెడ్డి ఉన్నారు. నియోజకవర్గాల డెవలప్మెంట్ కోసం అంటూ పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరారు. ఒక పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు ముఖ్యగా ప్రతిపక్ష పార్టీల నుంచి అధికార పక్షంలోకి దూకడం సర్వసాధారణంగా జరిగే పరిణామే. ఈ కారణంగా ప్రభుత్వాలు పడిపోయి కొత్త ప్రభుత్వాలు వచ్చన సందర్భాలు కూడా ఉన్నాయి. లోక్ సభ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గద్వాల్ ఎమ్మెల్యే క్రిష్ణ మోహన్ రెడ్డి, రాజేందర్ నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, శేరి లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కాంగ్రెస్ లో చేరారు. వీరు కాకుండా శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీలు) భానుప్రసాద్, బస్వరాజు సారయ్య, దండె విఠల్, ఎంఎస్ ప్రభాకర్, యెగ్గె మల్లేషం, బొగ్గారపు దయానంద్ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

**పార్టీ ఫిరాయింపుల చట్టం ఏం చెబుతోంది?**

ఒక రాజకీయ పార్టీ నుంచి ఎన్నికల్లో గెలిచాక, వివిధ కారణాలను సాకుగా చూపెట్టి మరో రాజకీయ పార్టీలో దూకడాన్ని అడ్డుకునేందుకు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం తీసుకొచ్చారు. 1985లో రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలోనే 52వ రాజ్యాంగ సవరణ ద్వారా 10వ షెడ్యూలును చేర్చారు. అందులో 101, 102, 190, 191 ఆర్టికల్స్ లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి వివరంగా పేర్కొన్నారు. ఒక రాజకీయ పార్టీ బి ఫారంపై (పార్టీ ఎన్నికల గుర్తు) గెలిచి, మరో పార్టీలో చేరి, విప్ ను ధిక్కరించిన సందర్భాల్లో స్పీకర్ అనర్హత వేటు వేయొచ్చు. అయితే, దీనిని నుంచి బయట పడేందుకు మెజారిటీ రాజకీయ పార్టీలు తమ పార్టీలో చేరిన వారిని తమ ఖాతాలో వేసుకోకుండా వారి మద్దతును మాత్రం కూడగడుతుంటాయి. అంతే కాకుండా ఒక పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు పార్టీ మారితే, దానిని విలీనంగా పరిగణిస్తారు. ఇలాంటి సందర్భాల్లో ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు. నాటి టీఆర్ఎస్ చేసింది అదే 2014 ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో అధికారంలోకి వచ్చిన అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం టీడీపీ శాసనసభా పక్షాన్ని తమ పార్టీలో విలీనం చేసుకోవడం ద్వారా ఆ పార్టీకి చెందిన పదకొండు మంది ఎమ్మెల్యేల సంఖ్యను తమ ఖాతాలో వేసుకుంది. శాసనమండలిలోనూ ఇదే జరిగింది. టీడీపీకి చెందిన ఎమ్మెల్సీలు అప్పటి టీఆర్ఎస్ లో విలీనం అయ్యారు. 2018 శాసన సభ ఎన్నికల్లో రెండో సారి అధికారం చేపట్టిన బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకుంది. రెండింట మూడొం తుల మంది ఎమ్మెల్యేలు ఇలా పార్టీ మారడంతో కాంగ్రెస్ శాసన సభాపక్షం, బీఆర్ఎస్ శాసన సభాపక్షంలో విలీనం జరిగినట్లు ప్రకటించారు. దీంతో ఫిరా యింపుల చట్టం వర్తించలేదు.పదేళ్లు అధి కారంలో ఉన్న బీఆర్ఎస్ టీడీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుని బలం పెంచుకున్నట్టే.., కాంగ్రెస్ సైతం అదే బాటలో ఉంది. బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకుంటోంది. కానీ, బీఆర్ఎస్ శాసన సభాపక్షాన్ని విలీనం చేసుకునేంత సంఖ్యలో ఎమ్మెల్యేలు ఇంకా కాంగ్రెస్ లోకి రాలేదు. బీఆర్ఎస్ నాయకత్వం ప్రధానంగా దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులను టార్గెట్ చేసి స్పీకర్ కు ఫిర్యాదు చేసింది. వాస్తవానికి తమ పార్టీ ఎన్నికల గుర్తుపై గెలిచిన సభ్యుడు ఇతర పార్టీలోకి వెళ్లడాన్ని నిరిస్తూ ఫిర్యాదు చేస్తే, సదరు సభ్యుడిపై అనర్హత వేటు వేసే నిర్ణయాధికారం సభాపతి (స్పీకర్)కి ఉంటుంది.ఇప్పటికే ఈ ముగ్గురు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ శాసన సభాపక్ష తరపున స్పీకర్ కు ఫిర్యాదు చేసినా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ హై కోర్టును ఆశ్రయించింది. పార్టీ మారిన సభ్యులపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేసినా, చర్యలు తీసుకోవడంలో విఫలమైనా కోర్టుల్లో సవాల్ చేసే వెసులుబాటును పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కల్పించింది. దీని ఆధారంగానే బీఆర్ఎస్ హై కోర్టును ఆశ్రయించగా, నాలుగు వారాల్లోగా నిర్ణయాన్ని ప్రకటించాలని, ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ ముందు ఉంచాలని శాసన సభా కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది.



# కొత్త కార్డులతో పెరిగిన బియ్యం కోట



కరీంనగర్ : తెలంగాణలో కొత్త రేషన్ కార్డులకు బియ్యం పంపిణీకి రంగం సిద్ధమైంది. గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి గ్రామ సభల ద్వారా లబ్దిదారులకు కొత్త కార్డులు ఇచ్చారు. కార్డులను పొందిన వారందరికీ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అవసరమైన కోటాను ఆయా జిల్లాలకు కేటాయించింది.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 63 మండలాలు, 14 పురపాలికలు, రెండు నగర పాలక సంస్థలు గ్రామ, వార్డు సభలు నిర్వహించి జాబితాలో ఉన్నవారి పేర్లను చదివి వినిపించారు. ఆ తర్వాత గతనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంక్షేమ పథకాలను ప్రారంభించే లక్ష్యంతో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులుగా గుర్తించారు. ఉమ్మడి జిల్లాలోని 1,608 మందికి రేషన్ కార్డులు అందజేశారు. కొత్త కార్డుల్లో 9,663 యూనిట్లు (లబ్ధిదారులు) నమోదవగా ఈ నెల నుంచి వారికి బియ్యం పంపిణీ చేయనున్నారు.కొత్త కార్డుల్లోని లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు ఉమ్మడి జిల్లాకు ఈ నెలలో 54.751 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెరిగింది. మరోవైపు గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హులైన మిగతా లబ్దిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కొత్త రేషన్ కార్డుల కోసం నాలుగు జిల్లాల్లో కలిపి 1,01,103 దరఖాస్తులు వచ్చాయి. అర్హులను గుర్తించే ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి వచ్చే నెల నుంచి వారికి కూడా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.కరీంనగర్ సివిల్ సప్లై అధికారి నర్సింగరావు మాట్లాడుతూ గత నెలలో మండలాని ఒక గ్రామంలో పంపిణీ చేసిన రేషన్ కార్డుల్లోని లబ్దిదారులకు ఈ నెల నుంచే బియ్యం పంపిణీ జరుగుతుందని చెప్పారు. వచ్చే నెలకు కార్డులు, లబ్దిదారుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. రేషన్ కార్డుల జారీ, సభ్యుల పేర్లు చేర్చడం, అనర్హుల పేర్లు తొలగించడం నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికి రేషన్ కార్డులు వస్తాయని చెప్పారు. పాత రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు మీ-సేవ కేంద్రాల్లో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నప్పటికి ఇంకా తమ లాగిన్లోకి రాలేదని, ఈ ప్రక్రియ ప్రారంభమైన వెంటనే నూతన సభ్యుల పేర్లను చేర్చుతామని చెప్పారు.

## టీటీడీలో అన్యమత ఉద్యోగులపై చర్యలు ప్రారంభం

తిరుమల : టీటీడీలో పనిచేస్తున్న అన్యమతస్థులపై ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాలతో చర్యలు ప్రారంభం అయ్యాయి. అధికారులు టీటీడీ ఉద్యోగులుగా ఉ ంటూ హిందూ మతేతర సంప్రదాయాలను అనుసరిస్తున్న 18 మంది ఉద్యోగులను గుర్తించారు. నవంబర్ 18, 2024 టీటీడీ బోర్డు తీర్మానం, ఎండోమెంట్ యాక్ట్ 1060, 1989 ప్రకారం హిందూమత సంప్రదాయాన్ని అనుసరిస్తామని ప్రమాణంచేసి టీటీడీలో ఉద్యోగం పొంది అన్యమతాన్ని అభ్యసిస్తూ...భక్తుల మనోభా వాలను, టీటీడీ పవిత్రతను కొందరు ఉద్యోగులు దెబ్బతీస్తున్నారని గుర్తించారు. హిందూ మతేతర కార్యక్రమాల్లో పాల్గొంటూనే, టీటీడీ ఉత్సవాల్లోనూ పాల్గొంటున్న 18 మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు అదేశం జారీ అయ్యాయి. 18 మంది అన్యమత ఉద్యోగుల్లో ఎవరైనా తిరుమల, టీటీడీ అనుబంధ ఆలయాల్లో, ఆలయ అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్నట్లయితే వెంటనే బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇకపై సదరు ఉద్యోగులను టీటీడీ ఆలయాల్లో ఉత్సవాలు, ఊరేగింపులు ఇతర హిందూ కార్యక్రమాల విధులకు నియమించకూడదని అదేశం ఇచ్చారు. అన్యమత ఉద్యోగులను ప్రభుత్వ శాఖలకు బదిలీ లేదా విఆర్ఎస్ ఇచ్చి బయటకు పంపాలని ఇటీవల టీటీడీ బోర్డు తీర్మానం చేసిన విషయం తెలిసిందే.

## తెలంగాణలో కొత్త రేషన్ కార్డులకు ఈనెల నుంచే

### బియ్యం పంపిణీ కోటా బియ్యం కేటాయింపు

హైదరాబాద్ : తెలంగాణలో కొత్త రేషన్ కార్డులకు బియ్యం పంపిణీకి రంగం సిద్ధమైంది గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి గ్రామ సభల ద్వారా లబ్దిదారులకు కొత్త కార్డులు ఇచ్చారు. కార్డులు పొందిన వారందరికీ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అవసరమైన కోటాను ఆయా జిల్లాలకు కేటాయించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 63 మండలాలు, 14 పురపాలికలు, రెండు నగర పాలక సంస్థలు గ్రామ, వార్డు సభలు నిర్వహించి జాబితాలో ఉన్నవారి పేర్లను చదివి వినిపించారు. ఆ తర్వాత గతనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంక్షేమ పథకాలను ప్రారంభించే లక్ష్యంతో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులుగా గుర్తించారు. ఉమ్మడి జిల్లాలోని 1,608 మందికి రేషన్ కార్డులు అందజేశారు. కొత్త కార్డుల్లో 9,663 యూనిట్లు లబ్ధిదారులు, నమోదవగా ఈ నెల నుంచి వారికి బియ్యం పంపిణీ చేయనున్నారు.

**కొత్త కార్డులతో పెరిగిన బియ్యం కోట..** కొత్త కార్డుల్లోని లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు ఉమ్మడి జిల్లాకు ఈ నెలలో 54.751 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెరిగింది. మరోవైపు గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హులైన మిగతా లబ్దిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కొత్త రేషన్ కార్డుల కోసం నాలుగు జిల్లాల్లో కలిపి 1,01,103 దరఖాస్తులు వచ్చాయి. అర్హులను గుర్తించే ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి వచ్చే నెల నుంచి వారికి కూడా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**త్వరలో పాత కార్డులో కొత్తగా పేర్లు చేర్చే అవకాశం:**

కరీంనగర్ సివిల్ సప్లై అధికారి నర్సింగరావు మాట్లాడుతూ గత నెలలో మండలాని ఒక గ్రామంలో పంపిణీ చేసిన రేషన్ కార్డుల్లోని లబ్దిదారులకు ఈ నెల నుంచే బియ్యం పంపిణీ జరుగుతుందని చెప్పారు. వచ్చే నెలకు కార్డులు, లబ్దిదారుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. రేషన్ కార్డుల జారీ, సభ్యుల పేర్లు చేర్చడం, అనర్హుల పేర్లు తొలగించడం నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికి రేషన్ కార్డులు వస్తాయని చెప్పారు.

## కిషన్ రెడ్డిపై యాదవ సంఘాల మండిపాటు

హైదరాబాద్ : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీజేపీ పార్టీని రెడ్డి సంఘం గా మార్చారంటు యాదవ్ సంఘం ఆరోపించింది. జాతీయ యాదవ హక్కుల పోరాట సంఘం బుధవారం తెలంగాణ బీజేపీ ఆఫీస్ ముట్టడితో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. బీజేపీ ప్రకటించిన జిల్లాల అధ్యక్షులలో ఒక్క యాదవ్ కి కూడా పదవులు ఇవ్వలేదని యాదవ సంఘాలు ఆరోపించాయి. తెలంగాణలో వున్న 16 శాతం యాదవులు రానున్న స్థానిక ఎన్నికల్లో తమ ఓటుద్వారా బీజేపీకి తగిన బుద్ధిచెబుతారని జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ హెచరించారు



డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసిపి బి.నందిరాం నాయక్..



డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వరంగల్ ఎమ్మార్వో ఇక్బాల్..



## సమస్యలపై ప్రత్యేక అధికారికి వినతి

**వేద న్యూస్, వరంగల్:**

హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని దేవునూర్ గ్రామంలో తాగునీటి కోసం రూ.72 లక్షలు ఖర్చుపెట్టినా.. నేటికీ లీకేజీ అయి డ్రైనేజీ వాటర్ మాత్రమే సరఫరా అవుతున్నాయని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఈ విషయమై వెంటనే తగు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రత్యేక అధికారి, నాయబ్ తహశీల్దార్‌ను ఆయన ఆఫీసులో గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ ధర్మసాగర్ మండల ప్రధాన కార్యదర్శి కొంగంటి సందీప్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు సంగెకారి యువరాజు మాట్లాడుతూ.. గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్‌కు విన్నవించినట్టు పేర్కొన్నారు. దేవునూర్‌లో అర్హులకు (ప్రధాన మంత్రి అవాస్ యోజన) ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. మిషన్ భగీరథ స్కీం కింద లక్షల రూపాయలు గ్రామ తాగునీటి అవసరాల నిమిత్తం ఖర్చుపెట్టినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్టు వెల్లడించారు.



## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

దామరచర్ల మండలంలోఎస్ఎఫ్ఐ మహాసభల పోస్టర్‌ను మండల కార్యదర్శి వీరన్న నాయక్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని తక్షణమే మేధావులతో, విద్యార్థి నాయకులతో, మంత్రులతో చర్చించి విద్యారంగ సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 17, 18 తేదీల్లో నల్గొండలో జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 45వ మహాసభలను అధిక సంఖ్యలో విద్యార్థులు విద్యార్థి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమీన్ విగ్నేష్, అభిషేక్, విశాన్ ,మహేష్, హర్షిత ,పింకీ, అశ్విని, త్రివేణి, అంకిత ,ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



## కార్మికులకు రూ.లక్ష రుణం ఇవ్వాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ఐఎన్ టియూసీ గ్రేటర్ వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో జిడబ్ల్యుఎంసి కెనరా బ్యాంక్ మేనేజర్ ని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ అవుటో సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో రూ.50వేల రుణం మంజూరు చేసి అదుకున్నారు. అలాగే ప్రస్తుతం కూడా కార్మికుల అర్థిక అవసరాల దృష్ట్యా లక్ష రూపాయల రుణం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టియూసీ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు పాశం రవి యాదవ్, జనరల్ సెక్రటరీ డి.రమేశ్, సిహెచ్ సంపత్, వర్కింగ ప్రెసిడెండ్ బైరబోయిన గట్టయ్య, కార్యదర్శి ఎస్.శేఖర్, పి. ధర్మారావు, డబ్ల్యూ. సత్యనారాయణ, ప్రమీల, స్వరూప, సునీత, సరిత తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న గండ్ర జ్యోతి

**వేద న్యూస్, శాయంపేట :**



శాయంపేట మండలం ప్రతిపాక గ్రామంలో జరుగుతున్న ఆదిత్యాది నవగ్రహ పునః ప్రతిష్ట, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భూపాలపల్లి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పత్తిపాక భక్త బృందం వారికి ఘన స్వాగతం పలికారు. అనం తరం దేవతామూర్తుల దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాయంపేట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి,మండల యూత్ అధ్యక్షులు మారపల్లి మోహన్, గ్రామ శాఖ అధ్యక్షులు పసుల ప్రవీణ్ కుమార్, గాదె రాజేందర్, దాసి శ్రావణ్ కుమార్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మారపల్లి నందం, ముఖ్య నాయకులు గంటా శ్యాంసుందర్ రెడ్డి దంపతులు, సావుళ్ళ కిష్టయ్య, కరుణ్ బాబు, బండ నారాయణరెడ్డి, పల్లవేనా రామరాజు గజ్జిరాజు, పోతుగంటి సుభాష్, మాందాడి రాజు, కుసుమ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టును బెదిరింపులకు గురి చేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి

**వేద న్యూస్, జయశంకర్ భూపాలపల్లి :**



పత్రిక,మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించేలా జర్నలిస్టును బెదిరింపుల గురిచేస్తున్న అధికారి పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్.యూ.జే.ఐ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పావుశెట్టి శ్రీనివాస్,జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,ప్రధాన కార్యదర్శి జల్ది రమేష్ లు డిమాండ్ చేశారు.గురువారం కాకతీయ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భూపాలపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కులం, నివాసం, ఆదాయం సర్టిఫికెట్ల జారీ విషయంలో ఆలస్యం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఓ జర్నలిస్ట్ కథనం ప్రచురించగా ఆ సమస్యను పరిష్కరించాల్సిన అధికారి కథనం రాసిన జర్నలిస్టును కార్యాలయం కు పిలిచి బెదిరింపులకు గురిచేడాన్ని టీఎస్ జేయూ(ఎన్‌యూజేఐ) యూనియన్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు.ప్రభుత్వానికి ప్రజలకు వారధి గా జర్నలిస్టులు పనిచేస్తున్నారన్నారు.ప్రజా సమస్యలు వెలికితీయడంలో జర్నలిస్టు పాత్ర కీలకమని అలాంటి సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే జర్నలిస్ట్ హక్కులు అణచివేసేలా ప్రవర్తిస్తూ జర్నలిస్టులను బేధింపులకు గురిచేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.జిల్లాలో ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా, జర్నలిస్టుల గౌరవం,హక్కులు కాపాడేలా సదరు అధికారి పై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.లేని పక్షంలో జర్నలిస్ట్ లంతా ఏకమై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ నల్గొండ కార్యదర్శి శంకర్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



ఫిబ్రవరి 17,18 తేదీల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా 45వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కార్యదర్శి శంకర్ అన్నారు. గురువారం మహాసభల కరపత్రాలను మిర్యాలగూడ డివిజన్ కేంద్రంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల పరిస్థితి అయోమయంగా ఉంది అన్నారు.రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి విద్యార్థులు అనేకమైన విద్య రంగా సమస్యలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న కూడా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరం నాలుగు నెలలు అవుతున్న కూడా ఇప్పటివరకు రాష్ట్రానికి విద్యశాఖ మంత్రిని కేటాయించలేకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యరంగ సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా 45వ మహాసభలకు విద్యార్థులు, మేధావులు యువత భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు జగన్, సైదా నాయక్, ప్రసన్న, వీరన్న ,సంపత్ మణి, అనిల్, అఖిల్ ,బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ఈవ్ టీజింగ్..టీ-సేఫ్ పై అవగాహన పెంచుకోవాలి

- మనన్ భట్ ఐపీఎస్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**



నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని ఐపీఎస్ మనన్ భట్ అన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ మనన్ భట్, షీ టీమ్ పోలీస్ స్టేషన్ సీఐ కే.సుజాత పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్, టీ-సేఫ్ అప్ పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి పిర్యాదు చేయాలన్నారు. అన్నోన్ నెంబర్స్ నుండి మహిళలకు ఎవరి నుండైన ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 కి పిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపల్ డి.సునీత, షీ టీమ్ ఎస్ఐ కంచి. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తాం

- ఏవో గంగా జమున

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రానికి చెందిన రైతులు నత్తి మహేందర్, దైనంపల్లి కుమారస్వామి, చిట్టి రెడ్డి మహేందర్ రెడ్డిలు మొక్కజొన్న పంటలో గడ్డి మందు పిచికారి చేస్తే పంట మొక్కలు చనిపోయాయని ఫర్టిలైజర్ షాప్ ముందు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతులలో కలసి నష్టపోయిన మొక్కజొన్న పంటను ఏవో గంగాజమున పరిశీలించారు. రైతులు గడ్డిమందు పిచికారి చేయడం వలన సుమారుగా నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా నష్టం జరిగింది అన్నారు. ముగ్గురు రైతులకు నష్టపోయిన పంటకు పరిహారం ఇప్పిస్తాను అని భరోసా ఇచ్చారు. పురుగుల మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మందుల ప్యాకింగ్ డబ్బాలపై తయారి తేదీ గడువు పరిశీలించడం తప్పనిసరి గడువు దాటిన మందులను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దని నిర్ణీత ప్యాకింగ్ సీలున్న మందులనే కొనుగోలు చేయాలి తెలిపారు. లీకేజీ ఉన్న డబ్బాలను పరిశీలించి కొనుగోలు చేసే ముందు దాని రసీదు బిల్లు తప్పనిసరిగా తీసుకొని బిల్లులో మందు పేరు కంపెనీ వివరాలు బ్యాచ్ నెంబరు రైతు సంతకం ఉంటేనే మంచి దని అన్నారు. ఒకవేళ రైతు నష్టపోతే పరిహారం పొందడానికి ఈ బిల్లు ఉపయోగపడుతుంది అని వారు సూచించారు.



## మహాశివరాత్రికి మెట్టుగుట్టపై టెండర్లకు వేలం

**వేద న్యూస్, కాజీపేట :**

ఓరుగల్లు మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానములలో ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం ఆలయ కార్యాలయంలో దేవాదాయ శాఖ, వరంగల్ పరిశీలకులు డి.అనిల్, కార్యనిర్వహణాధికారి, చైర్మెన్‌ల ఆధ్వర్యంలో లడ్డు పులిహోర, కొబ్బరి కాయలు, కొబ్బరి చిప్పలు పోగుచేస్కోవడం, వాహన పార్కింగ్ నిర్వహణ, చెరకు బండి నిర్వహణ, అభిషేక పంచామృతాలు, లడ్డు పులిహోర, అభిషేక పంచామృతాలు అమ్ముకునే టెండర్లకు వేలం నిర్వహించారు. నిర్వహించిన వేలములలో భాగంగా వాహన పార్కింగ్ టెండర్ వల్లేపు వెంకన్న, రూ.26,000, చెరకు బండి నిర్వహణకు పల్లపు మధు, మడికొండ రూ. 12,000లపై టెండర్ హెచ్చు పాటగా ఖరారు చేయడం జరిగిందని తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషు భారతి, శివాలయం చైర్మెన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, రాజు, ఉమ, శ్రీనివాస్, దయాకర్, కేదారి, జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌ను మండలంగా ప్రకటించాలి

- పరకాల-హుజురాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామాన్ని కొన్ని చిన్న గ్రామాలతో కలిపి కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని ఉప్పల్ మండల జేఏసీ నాయకులు గురువారం పరకాల-హుజురాబాద్ ప్రధాన రహదారి పై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా పనిచేసినటువంటి పాడి కౌశిక్ రెడ్డి ఉప్పల్ ను మండలం చేస్తామని ప్రకటించారని, కానీ ఇప్పుడు వేరే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని దాంతో ఈ విషయం మరుగున పడిపోయిందని గుర్తు చేశారు. మండలంగా ఏర్పాటు చేయడానికి కావలసిన అన్ని అర్హతలు ఉప్పల్ గ్రామానికి ఉన్నాయని కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఉప్పల్ ను మండలం గా ప్రకటించి ఉప్పల్ గ్రామ ప్రజల కోరికను నెరవేర్చాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉప్పల్ మండల జేఏసీ నాయకులు, ఉప్పల్ గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073